క్లుప్తంగా

ప్రమాదకరంగా కరెంట్ స్తంభం


విరిగి పెచ్చులుడిన కరెంట్ స్తంభం

దుబ్బాక: దుబ్బాక పట్టణంలోని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహం సమీపంలో గల కరెంట్ స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో స్తంభం విరిగి పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. స్తంభం ప్రమాదకరంగా ఉందని ప్రజలు సంబంధిత అధికారులకు సమాచారం అందించి మూడు రోజులవుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దుబ్బాక నుంచి ముస్తాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే స్తంభం ఉండడంతో ఎప్పుడు కిందపడుతుందోనని వాహనదారులు, సమీపంలో ఉన్న దుకాణాదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఏ ప్రమాదం జరగక ముందే విరిగిన స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పండిట్‌లను విధుల్లోకి తీసుకోవాలి

గజ్వేల్: రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో 9, 10 తరగతులకు పాఠాలు బోధించడం లేదనే సాకుతో పండిట్‌లను సస్పెండ్ చేయడం సరికాదని పీఆర్టీయూ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సస్పెండ్ చేసిన పండిట్‌లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాడ్ చేశారు. వారికి పదోన్నతులతో పెండింగ్‌లో ఉన్న ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

మద్దూరు(హుస్నాబాద్): సీఎం కేసీఆర్ కొనసాగిస్తున్న కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బల్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం దూళ్మిట్ట మండలంలోని కొండాపూర్ గ్రామంలో ప్రజాగోస బీజేపీ భరోసా శక్తి కేంద్రాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను గ్రామగ్రామాన ఎండగట్టేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శశిధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భిక్షపతినాయక్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి సోగాల మనోజ్‌కుమార్, బీజేపీ నాయకులు లక్ష్మణ్‌నాయక్, రచ్చ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం


సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్న రవి, తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ముదిరాజ్‌ల అభివృద్ధికి అందరం కృషి చేద్దామని ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడు రవి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముదిరాజ్ ఇంటింటికీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని సభ్యులకు తెలిపారు. కార్యక్రమంలో రాజబోయిన రాజు, యాట రాజేశ్, నీలం సురేశ్, కండ్లకోయ గౌరీశంకర్, శీను, నాయిని కృష్ణ, నర్సింలు, నాగరాజు, కోడూరి వెంకటేశ్, కేసరి శేఖర్, జెల్ల నరేశ్, మంతూర్ శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల సీఐగా సత్యనారాయణరెడ్డి



చేర్యాల(సిద్దిపేట): చేర్యాల నూతన సీఐగా పి.సత్యనారాయణరెడ్డి శుక్రవారం రాత్రి బాధ్యతలు చేపట్టాడు. ఇక్కడ సీఐగా పనిచేసిన మంచినీళ్ల శ్రీనివాస్ పలు కారణాలతో సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఆ స్థానంలోకి ఖమ్మం స్పెషల్ బ్రాంచిలో సీఐగా పనిచేస్తున్న సత్యనారాయణరెడ్డిని బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐజీ ఉత్తర్వుల మేరకు వచ్చిన ఆయన శుక్రవారం రాత్రి బాధ్యతలు చేపట్టాడు.


గజ్వేల్‌రూరల్: పార్థివేశ్వరాలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న జిల్లా రవాణా శాఖ సభ్యుడు ఇర్షాద్


దుబ్బాక: స్వయంభూ శంభు లింగేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


హుస్నాబాద్: పట్టువస్త్రాలను తీసుకొస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత


చిన్నకోడూరు(సిద్దిపేట): ఇబ్రహీంనగర్ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

హరహర మహాదేవ శంభో శంకర

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు, ఉపవాస దీక్షలతో భక్తులు
- ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహాశివరాత్రిని పురస్కరించుకొని పట్టణంలోని ఉమాపార్థీశ్వర కోటిలింగేశ్వర ఆలయం, శరభేశ్వర ఆలయం, శివాలయాలతో పాటుగా అన్ని శైవ, వైష్ణవ ఆలయాల్లో శివలింగాలకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని ఉమాపార్థీశ్వర కోటిలింగేశ్వర ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, కౌన్సిలర్‌లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా వేములవాడ కమాన్ వద్ద శ్రీశ్రీశ్రీ కృష్ణజ్యోతి స్వరూపానందస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శివరాత్రి ఉత్సవాల్లో యాగస్థలి వద్ద సోమనాథ మందిర నమూనాలో శివలింగాన్ని ప్రతిష్ఠించి, భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. ఆలయాలకు వచ్చే భక్తులకు పట్టణానికి చెందిన ఇర్షాద్ (జిల్లా రవాణాశాఖ సభ్యులు) పండ్లు, పాలు, మజ్జిగ, మంచినీటి ప్యాకెట్‌లు పంపిణీ చేశారు.

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణంలోని సీతారామఉమామహేశ్వరాలయం, అన్నపూర్ణా విశ్వేశ్వరాంజనేయ ఆలయం, ప్రజ్ఞాపూర్‌లోని పార్థివేశ్వరాలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అలాగే ప్రజ్ఞాపూర్‌లోని పార్థివేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కాగా ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రజ్ఞాపూర్‌లోని పార్థివేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు పట్టణంలోని సీతారామఉమామహేశ్వరాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పండ్లు, రసాలను పంపిణీ చేశారు.

దుబ్బాక: దౌల్తాబాద్‌లో గుట్టపై గల స్వయంభూ శంభు లింగేశ్వరాలమంలో మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, గోపూజ నిర్వహించారు.


చిన్నకోడూరు(సిద్దిపేట): పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు

హుస్నాబాద్: పట్టణంలోని సిద్ధేశ్వర ఆలయం, కాశీ మరకత లింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని కాశీ మరకత లింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని సలేంద్రి రామలింగేశ్వరాలయం, ఇబ్రహీంనగర్ శివాలయం, రామంచలోని శివాలయంతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో శివ లింగాలకు భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు.


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్ల దంపతులు

తొగుట(దుబ్బాక): తొగుట కోటిలింగాల, గుడికందుల భైరవస్వామి, ఎల్లారెడ్డిపేటలో త్రిలింగేశ్వర స్వామి, కాన్గల్‌లో బుగ్గరాజేశ్వరస్వామి ఆలయాలు ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడాయి. కోటిలింగాల ఆలయంలో పీఠాధిపతి మాదవానంద సరస్వతి స్వామి పర్యవేక్షణలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. శనివారం మండల పరిధిలోని చంద్లాపూర్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిద్దిపేట ప్రాంతం ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా మారిందన్నారు. ప్రభుత్వం అన్ని మతాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

దుబ్బాకరూరల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భూంపల్లి మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు సంకేత్‌శర్మ ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు.

ఆధ్యాత్మిక మార్గంతోనే మానసిక ప్రశాంతత

దుబ్బాకటౌన్: ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణిస్తే భక్తి భావం పెంపొందడంతోపాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని బ్రహ్మకుమారి సంస్థ సిద్దిపేట ఇన్‌చార్జి భవాని అన్నారు. దుబ్బాక పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద శివరాత్రి సందర్భంగా బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు, స్వర్ణిమ శివలింగ దివ్యదర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డితో కలిసి భవాని ప్రారంభించారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి, మోతె, భూంపల్లి, జంగపల్లి, చెప్యాల గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పూజలుచేసి ఉపవాసాలు చేపట్టారు.

నంగునూరు(సిద్దిపేట): బద్దిపడగలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. వేములవాడ వెళ్ల లేని భక్తులు ఆలయంలో ఉన్న గండ దీపంలో నూనె పోసి కోడెలను కట్టి మొక్కులు తీర్చుకున్నారు.


తొగుట(దుబ్బాక): కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు


గజ్వేల్‌రూరల్: పూజలు చేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని శివ, మార్కండేయ, హనుమాన్ ఆలయాల్లో శనివారం శివలింగాలకు అభిషేకాలు చేసి శివుడికి ఇష్టమైన మారేడుపత్రి, గోగిపూవులతో అలంకరించారు.

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మర్పడ్గలోని సంతాన మల్లికార్జునస్వామి ఆలయం, కొండపాకలోని రుద్రేశ్వర ఆలయం, దుద్దెడలోని స్వయంభూ శంభు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దర్శనానికి తరలివచ్చిన భక్తులు


దుబ్బాకరూరల్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు


దుబ్బాకటౌన్: జ్యోతిర్లింగాల దివ్యదర్శనంలో చైర్‌పర్సన్ వనిత, తదితరులు


కొండపాక(గజ్వేల్): దర్శనానికి క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు


నంగునూరు(సిద్దిపేట): బద్దిపడగలో పూజలు చేస్తున్న దృశ్యం

రాజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు


పట్టు వస్త్రాలతో ఆలయానికి వస్తున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్


శివుడికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

- భక్తులతో పొట్లపల్లి రాజేశ్వరాలయంకిటకిట
- దర్శనం కోసం వచ్చి క్యూ లైన్‌లో పడిపోయిన మహిళ
- 108లో ఆస్పత్రికి తరలింపు

హుస్నాబాద్ రూరల్: పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలను సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు సంతోషంగా ఉండాలని కోరారు. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే స్వామి స్వయంభూ రాజేశ్వరస్వామి అన్నారు. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని స్వామిని కోరినట్లు చెప్పారు. మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి స్వామివారిని దర్శించుకున్నారు. బీజేపీ నాయకుడు పార్టీ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, ఎంపీపీ లకావత్ మానస, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల అతిథులకు ఈఓ విశ్వనాథశర్మ శాలువాలు కప్పి సన్మానించి జ్ఞాపికలను అందించారు. దర్శనం కోసం క్యూలో నిల్చున్న మహిళ కళ్లు తిరిగి పడిపోవడంతో ఆలయ సిబ్బంది 108కు సమాచారం అందించి ఆస్పత్రికి పంపించారు. ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా సీఐ ఎర్రల కిరణ్, ఎస్సైలు మహేశ్, నరేందర్‌రెడ్డి పర్యవేక్షించారు.

సౌకర్యాలపై ఈఓను నిలదీత

ఆలయంలో జాతరకు వచ్చిన భక్తులకు సౌకర్యాలు లేకపోవడంతో ఈఓ విశ్వనాథశర్మను నిలదీశారు. ఉత్సవాలకు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇచ్చే పులిహోరను దొడ్డు బియ్యంతో తయారు చేసి అందించారని దీనిపై ఈఓకు చెప్పినా స్పందించడం లేదని వైఎస్సార్‌టీపీ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి భక్తుల సమక్షంలోనే నిలదీశారు. నీళ్ల హౌజ్ వద్ద శుభ్రత లేదని, భక్తులు సేదతీరకుండా ఆలయం ఎదుట చెత్తతో నిండిపోయింది. విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది సైతం పారిశుధ్య పనులపై అసహనం వ్యక్తం చేశారు. భక్తులు ఆగ్రహించడంతో నాణ్యత లేని పులిహోరను తిరిగి పంపించారు.

ఆధ్యాత్మికతలో కొండపాకకు విశిష్ట చరిత్ర

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హన్మంతరావు


మాట్లాడుతున్న హన్మంతరావు

కొండపాక(గజ్వేల్): ఆధ్యాత్మికతలో కొండపాక పరిసర ప్రాంతానికి విశిష్ట చరిత్ర ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హన్మంతరావు అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని కొండపాక రుద్రేశ్వర ఆలయంలో పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ అనంతుల శ్యాంమోహన్‌తో కలిసి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆలయ పూర్వ వైభవానికి శ్యాంమోహన్ ఎంతో కృషి చేశారన్నారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా ఉద్యోగాలు పొందిన వారు కొండపాక గ్రామంలో ఉండటం గొప్ప విషయమన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పొరాడటంతో పాటు సీఎం కేసీఆర్‌కు రాజకీయ గురవైన అనంతుల మదన్‌మోహన్ విగ్రహాన్ని సిద్దిపేట పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావును ఆయన కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు గంప మహేందర్‌రావు, మద్దుల సోమేశ్వర్‌రావు, కొండపాక, కుకునూరుపల్లి కాంగ్రెస్ మండల అధ్యక్షులు వాసరి లింగారావు, విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు మద్దుల ఉమాదేవి, వీరేశం పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న మాజీ డీజీపీ


మల్లన్న సన్నిధిలో మాజీ డీజీపీ దినేశ్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామిని శనివారం మాజీ డీజీపీ దినేశ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బాలాజీ, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల కొట్టం దగ్ధం


కాలిపోయిన పశువుల కొట్టం

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పశువుల కొట్టం దగ్ధమవ్వగా, పశువులు ప్రాణాలతో బయటపడ్డ సంఘటన శనివారం చిన్నకోడూరు మండల కేంద్రంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెరుకు ఎల్లయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. పొలం వద్ద పశువుల కొట్టంలో రోజు మాదిరిగా పశువులను కట్టేశాడు. శుక్రవారం రాత్రి పంటకు మోటార్ పెట్టి ఇంటికి వచ్చాడు. సుమారు రాత్రి 11 గంటల సమయంలో పొలం వద్దకు వెళ్లగా పశువుల కొట్టం నుంచి మంటలు రావడంతో కొట్టంలోని పశువులను బయటకు తరలించాడు. రెండు గేదెలకు స్వల్ప గాయాలు కాగా, మిగతా గేదెలకు పెను ప్రమాదం తప్పింది. కొట్టంలో ఉన్న 10 బస్తాల ఎరువు, 30 టమాట పెట్టెలు, స్పింక్లర్ పైపులు తదితరవి పూర్తిగా కాలిపోయాయి. పూర్తిగా నష్టం వాటిల్లడంతో బాధిత రైతు బోరున విలపించాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

‘ఉపాధ్యాయుడిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి’

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కోటగిరి ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై పెట్టిన కేసులను వెంటనే ప్రభుత్వం ఎత్తివేయాలని స్వేచ్ఛ జేఏసీ నేతలు అన్నారు. శనివారం పట్టణంలోని సమీకృత బాలుర వసతి గృహంలో నిర్వహించిన సమావేశంలో స్వేచ్ఛ జేఏసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వేచ్ఛ జేఏసీ నేతలు శంకర్, యాదగిరి, రవి కుమార్, విద్యానాథ్, అరవింద్ మాట్లాడుతూ.. భారతీయ పౌరులందరూ శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై పోలీసులు పెట్టిన తప్పుడు కేసులు తక్షణమే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్, పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ నాయకులు శేఖర్, ప్రణయ్, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మ సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: విద్య విప్లవాన్ని సృష్టించిన భాగ్యరెడ్డివర్మ సేవలు మరువలేనివని దళిత, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. హిందూ ఉద్యమ పితామహుడు భాగ్యరెడ్డివర్మ 84వ వర్ధంతి సందర్భంగా శనివారం గజ్వేల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అణగారిన వర్గాలు, బాలికల కోసం పాఠశాలలను ప్రారంభించి విద్యనందించిన పూలే దంపతుల స్ఫూర్తితో భాగ్యరెడ్డివర్మ హైదరాబాద్‌లో పాఠశాలను ప్రారంభించి విద్యనందించారన్నారు. జగన్మిత్రమండలి, మన్యసంఘం, సంఘసంస్కార నాటకమండలి, అహింసా సమాజాలను స్థాపించి హైదరాబాద్ ప్రాంతంలో సంఘ సంస్కరణలకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు తుమ్మ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్‌టీఎస్ నాయకులు పొన్నాల కుమార్‌మాదిగ, తెలంగాణ అంబేడ్కర్ సంఘం నాయకులు చిప్పల యాదగిరి, మాల మహానాడు యువజన నాయకులు నీరుడి స్వామి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న నిర్వహణ కమిటీ సభ్యులు

సిద్దిపేటజోన్: శివాజీ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ యువజన, విద్యార్థి, శివాజీ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ తరలిరావాలని ప్రతినిధులు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో రంగధాంపల్లి శ్రీనివాస్, మెర్గ్ మహేశ్, జువ్వన కనకరాజు, గరిపల్లి మహిపాల్ గౌడ్, తీపి మహేశ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో కూడా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఉదయం 10 గంటలకు రంగధాంపల్లి హనుమాన్ ఆలయం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని, పట్టణ వీధుల గుండా వేంకటేశ్వర ఆలయం శివాజీ చౌక్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ర్యాలీ నేపథ్యంలో పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విస్తృతంగా శివాజీ మహారాజ్ ప్రతిమలతో కూడిన ఫ్లెక్సీలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.

సీఎం కేసీఆర్ ప్రధాని కావాలి


కార్యకర్తలకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీఎం కేసీఆర్ దేశ ప్రధాని కావాలని కోరుతూ అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని ఖాజీపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన పాదయాత్ర రెండోరోజు జగదేవ్‌పూర్‌కు చేరుకుంది. మాజీ ఏఎంసీ చైర్మన్ బాపురెడ్డి, జిల్లా నాయకులు భూపతిగౌడ్ వారి పాదయాత్రకు సంఘీభావం తెలిపి, పాదయాత్ర చేస్తున్న కార్యకర్తలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రధానమంత్రి కావాలని ఖాజీపూర్ నుంచి యాదాద్రి వరకు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. కేసీఆర్ ప్రధాని అయితే దేశం మొత్తం అభివృద్ధిలో ఆదర్శంగా నిలువడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మధు, పరశురామ్, చిరంజీవి, నాగరాజు, వీరయ్య, రమేశ్, మహేందర్, బాబు తదితరులు పాల్గొన్నారు.